క్లుప్తంగా

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

ఏలేశ్వరం: విజయవాడలో ఆదివారం నిర్వహించే భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు యల్లపు సూర్యనారాయణ కోరారు. మండలంలోని చిన్నింపేటలో శనివారం కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించే రాష్ట్ర మహాసభలో అనేక సమస్యలపై చర్చిస్తామన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పలు తీర్మానాలు చేస్తామన్నారు. రైతులు, కిసాన్ సంఘ్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ్ ప్రతినిధులు నీలగిరి చిట్టిబాబు, కంపరపు నాగేశ్వరరావు, ఆకుల హరిబాబు, రాయపురెడ్డి చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం...జగ్గంపేట వైపు నుంచి వస్తున్న లారీ మండలంలోని తాళ్లూరు శివారు దాబా ఎదురుగా యూటర్న్ తీసుకుంటుండగా దాని వెనకే మోటార్ సైకిల్‌పై వస్తున్న కొప్పు సత్యనారాయణ లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పరిశుభ్రతపై అవగాహన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ యూత్ రెడ్ క్రాస్ యూనిట్ మహిళా వలంటీర్ల ఆధ్వర్యంలో విద్యార్థినులకు శుభ్రత, ఆరోగ్యవంతమైన జీవన విధానం, రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు వీరబాబు (ఫైల్)

కిర్లంపూడి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసు హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వెంకటరమణ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన గుడాల వీరబాబు (48) ఆదే గ్రామానికి చెందిన గెద్దం అప్పారావుకు చెందిన ఎకరం భూమిని కౌలుకు తీసుకుని వరి చేను సాగు చేస్తున్నాడు. పొలంలో శుక్రవారం ఎలుకల నివారణకు మందు పెడుతుండగా ఆ మందు ప్రభావం వలన ఊపిరితిత్తులపై పడడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర విద్యాలయంలో ఏడో తరగతి విద్యార్థులకు పడాల ట్రస్ట్ దుస్తులను అందజేసింది. శనివారం విద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్నకేశవరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు రూ.1.50 లక్షలు విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు. ప్రిన్సిపాల్ కనిగిరి విశ్వేశ్వరరావు, ఏఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ వెంకట్రావు శనివారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన జరిగే సమావేశంలో పట్టణాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: విజయవాడలో డిసెంబర్ 4న జరిగే ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ ప్రత్తిపాడులో శనివారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం అల్లూరి విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ తెలుగు నేలపై మతోన్మాద రాజకీయాలు చేసే ఫాసిస్టు మూకలను తరిమికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రజా సమస్యలు ఉంటే, తిరుపతి లడ్డూ వ్యవహారం తెరపైకి తెచ్చి టీడీపీ–జనసేన మత రాజకీయాలు చేశాయని విమర్శించారు.

అలంకారప్రాయం.. అందని వైద్యం

- పాతకొట్టాం పీహెచ్‌సీలో వసతుల లేమి
- కొరవడిన సొంతభవనం, ఇతర సౌకర్యాలు
- అందుబాటులో లేని మందులు
- వైద్య సేవలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు


పాతకొట్టాం పీహెచ్‌సీలోని ఒకే హాలులో వైద్య సిబ్బంది సేవలు, రోగులు, మందుల పంపిణీ

కోటనందూరు: ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పాతకొట్టాం పీహెచ్‌సీ అలంకారప్రాయంగా మారింది. పేరుకే పీహెచ్‌సీ గాని కనీసం ఆరోగ్య ఉపకేంద్రంలో ఉన్న సౌకర్యాలు లేని పరిస్థితి. ఈ పీహెచ్‌సీకి సొంతభవనం లేకపోవడంతో గ్రామ సచివాలయంలోనే నిర్వహిస్తున్నారు. రెండు చిన్న గదులు, హాలు ఉన్న సచివాలయంలో పీహెచ్‌సీ నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఇక్కడున్న రెండు చిన్నగదుల్లో వైద్యులు విధులు నిర్వహిస్తుంటుండగా హాలులో రోగులకు కేవలం ఒక్క మంచం మాత్రమే ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు కనీసం జ్వరానికి కూడా మాత్ర ఇచ్చే పరిస్థితి లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ చిన్న రోగమొచ్చినా ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకోవాల్సిన దుస్థితి ఉందని ఈ ప్రాంత రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ పీహెచ్‌సీని ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ వైద్యం పేద ప్రజలకు అందడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో మెరుగైన సేవలు

కోటనందూరు పీహెచ్‌సీ పరిధిలో 70 వేలకు పైగా జనాభా ఉన్నారు. వీరికి మండల కేంద్రం కోటనందూరులో ఉన్న పీహెచ్‌సీ నుంచి వైద్య సేవలు అందేవి కావు. ఈ నేపథ్యంలో సగం జనాభాకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాతకొట్టాంలో మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేసింది. ఈ పీహెచ్‌సీ సొంతభవన నిర్మాణానికి స్థలాన్ని కూడా కేటాయించారు. అవసరమైన సిబ్బందిని సైతం నియమించారు. సొంతభవనం పూర్తయ్యేవరకూ పీహెచ్‌సీని గ్రామ సచివాలయంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, సీహెచ్‌ఓ, హెచ్‌వీతో పాటు ఇతర సిబ్బంది పని చేస్తున్నారు. కాగా ఇక్కడ రోజూ 30 నుంచి 50 మధ్యలో మాత్రమే ఓపీ నమోదు అవుతున్నటు సిబ్బంది చెబుతున్నారు.

అన్నీ కోటనందూరు పీహెచ్‌సీ నుంచే..

పాతకొట్టాం పీహెచ్‌సీలో పని చేసే వైద్య సిబ్బంది జీతాలు, ఇతర లావాదేవీలు అన్నీ కోటనందూరు పీహెచ్‌సీ నుంచే జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడకు అవసరమైన మందులు సైతం కోటనందూరు పీహెచ్‌సీ నుంచే తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఈ పీహెచ్‌సీకి బడ్జెట్, అభివృద్ధి కమిటీ లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడ ఆర్థిక పరమైన ఏ అవసరం వచ్చినా ఆ పని వెనుకబడుతోంది.

సిబ్బంది పనితీరుపై ఆరోపణలు

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాతకొట్టాం పీహెచ్‌సీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ సిబ్బంది పనితీరు పట్ల కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్లిపోతున్నారో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పారామెడికల్, ఎంఎల్‌హెచ్‌సీ, ఆశ సిబ్బంది పనితీరుపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సొంత భవనం ఏర్పాటు చేయాలి

కొత్తగా ఏర్పడిన ఈ పీహెచ్‌సీకి సొంతభవనం లేక ఇటు రోగులు అటు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మందులు, రోగులు, సిబ్బందికి వేర్వేరు విభాగాలు లేకపోవడంతో అందరూ ఒకేచోట ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇరుకు భవనంలో నిర్వహిస్తున్న పీహెచ్‌సీకి వస్తున్న రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సొంతభవనం ఏర్పాటు చేయాలి.

పీవీ నరసింహరావు, పాతకొట్టాం

అన్ని వసతులూ కల్పించాలి

ఉన్నత లక్ష్యంతో ఏర్పడిన ఈ పీహెచ్‌సీకి అన్ని వసతులు కల్పించాలి. మందులు, సిబ్బంది అందుబాటులో ఉంచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ వసతులు లేకపోవడంతో నిరుపేదలైన రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి అన్ని వసతులు ఏర్పాటు చేయాలి.

పిట్టం బాబూరావు, సంగవాక, పాతకొట్టాం పంచాయతీ

వలంటీర్ల ధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరణ


ప్రత్తిపాడులో ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రత్తిపాడు: ఏపీ గ్రామ/వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 28న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వలంటీర్లను కొనసాగిస్తామని, అధికారంలోకి రాగానే రూ.10 వేల వేతనం చెల్లిస్తామంటూ హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీని అమలు చేయాలని కోరుతూ ఆందోళనకు ఉపక్రమించినట్టు తెలిపారు. ఇప్పటికే పలు మంత్రివర్గ సమావేశాలు జరిగినప్పటికీ కనీసం వలంటీర్ల సమస్యలపై చర్చించలేదని ఆరోపించారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వలంటీర్ల సంఘ నాయకులు ఎం.సతీష్‌కుమార్, పి.భవానీ, వి.ప్రశాంతి, వి.దొర, పి.జ్యోతి, కె.ఆనంద్, యు.ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో లోపాల సవరణకు అవకాశం


జగపతినగరంలో రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

కిర్లంపూడి: భూముల రీ సర్వేలో లోపాలు సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ జె.చిరంజీవి తెలిపారు. జగపతినగరం వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి 7 అర్జీలు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలోని లోపాలను సవరించడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రావణి, ఎంఎల్‌ఎస్‌ఓ షేక్ బషీర్, ఎంఏఓ సత్యనారాయణ, రెవెన్యూ, రీసర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామ సభకు 33 అర్జీలు

గండేపల్లి: మండలంలోని యర్రంపాలెంలో శనివారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి 33 అర్జీలు అందినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గిరిజన పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి


బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

శంఖవరం: గౌరంపేట పంచాయతీ పరిధిలోని నాలుగు గిరిజన గ్రామాలను కలిపి ప్రత్యేకంగా పంచాయతీని ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. ఈ మేరకు కాకినాడలో బీజేపీ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాల్లో సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గౌరంపేట పంచాయతీ పరిధిలో ఉన్న మాసంపల్లి, ఎం.జగన్నాథపురం, గొంది, రాజారం గిరిజన గ్రామాలను కలుపుతూ ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మీసాల కృష్ణ, లోవరాజు, నందా రాంబాబు, చిన్న అప్పలరాజు, సత్యనారాయణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఐదోరోజూ కొనసాగిన నిరాహార దీక్ష


గుమ్మళ్లదొడ్డిలో ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

- శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎంపీ హర్షకుమార్

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రామాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమకారుడు పాఠంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి పాఠంశెట్టి శ్రీదేవి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శనివారం ఐదోరోజూ కొనసాగింది. దీక్షా శిబిరాన్ని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే తాను కూడా ఉద్యమం చేపడతానన్నారు. అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎం.శ్రీహరిబాబు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎస్.పద్మశ్రీరాణి, గోకవరం వైద్యాధికారులు దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్ష చేస్తున్న వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. దీక్షా శిబిరం వద్ద వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలిపారు. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఇతర పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని వాళ్లతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

ఆక్రమణల తొలగింపు


కత్తిపూడిలో రోడ్డుపై ఉన్న ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో ట్రాఫిక్ నివారణకు చర్యలు చేపట్టినట్లు రోడ్డు అథారిటీ మేనేజర్ వెంకటరమణ తెలిపారు. దీనిలో భాగంగా కత్తిపూడిలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఫ్లెక్సీలు, చిరుదుకాణాల్లో సామగ్రిని రోడ్డు మీద, ఫుట్ పాత్‌లపై పెట్టరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సత్యదేవుని దర్శించిన టూరిజం యాత్రికులు

అన్నవరం: రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ప్రారంభించిన ఒకరోజు పుణ్యక్షేత్ర సందర్శన కార్యక్రమంలో భాగంగా 18 మంది భక్తులు శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితుల ఆశీస్సులు అందచేశారు.

మద్యం దుకాణాన్ని అడ్డుకున్న మహిళలు


మద్యం దుకాణం నిర్మాణం కోసం వేసిన పునాది రాళ్లను పెకిలించివేస్తున్న మహిళలు

- దుకాణం పునాదులను పెకిలించి అడ్డుకున్న వైనం
- మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని ఎమ్మెల్యేకు వినతి

తుని రూరల్: మండలంలోని డి.పోలవవరం శివారు అశోక్ నగర్ గండి వద్ద మద్యం దుకాణం నిర్మాణాన్ని మహిళలు అడ్డుకున్నారు. దుకాణం కోసం నిర్మించతలపెట్టిన పునాదులను పెకిలించివేశారు. శుక్రవారం మాజీ ఎంపీపీ ఆధ్వర్యంలో మద్యం దుకాణం ఏర్పాటు కోసం షాపు నిర్మించతలపెట్టారు. పునాదులు తీస్తుండగా విషయం తెలుసుకున్న మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దాంతో నిర్మాణ పనులు నిలిపివేసి ఎవరికివారు వెళ్లిపోయారు. స్థలాన్ని అద్దెకి ఇచ్చిన యజమాని దగ్గరుండి శనివారం నిర్మాణాన్ని చేపట్టడంతో మళ్లీ మహిళలు, స్థానికులు ఏకమై నిర్మాణ పనులు అడ్డుకున్నారు. పునాదులకు వేసిన రాళ్లను పెకిలించి బయటకు తీసివేశారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని, అటువంటి ప్రయత్నాలు చేస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్థల యజమానిని హెచ్చరించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల కిందట మద్యం దుకాణం పెట్టేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నామని, మళ్లీ ఇప్పుడు మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మద్యం దుకాణం కారణంగా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఓట్లేసి గెలిపిస్తే మా కుటుంబాలను నాశనం చేసేందుకు మద్యం దుకాణం పెడతారా ? అంటూ వాపోయారు. అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని హెచ్చరించారు. స్థానికుల అనుమతి లేకుండా మద్యం షాపు ఏర్పాటు చేయరని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. కోటనందూరు పర్యటన ముగించుకుని తుని వస్తున్న ఎమ్మెల్యే గండిలో ఆగారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఎమ్మెల్యేను కలసి మద్యం దుకాణం ఇక్కడ ఏర్పాటు చేయవద్దని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె గండిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. దీంతో మహిళల ఆందోళన విరమించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన భూపతిపాలెం విద్యార్థులు

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం జరిగిన అండర్–14, అండర్–17 విభాగంలో జిల్లా స్థాయిలో మంచి ప్రదర్శన ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో బి.రిషికేష్ ఎ.ధనుష్, ఓ.మనోజ్‌కుమార్ ద్వితీయ స్థానాలు సాధించారు. అండర్ –17 విభాగంలో ఎ.లోవరాజు, ఎల్.రామ్ నాయుడు, అజయ్ కుమార్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు. వీరు వచ్చే నెల 11న శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ సుధను ప్రిన్సిపల్ అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


జగ్గంపేటలో పోలీసు స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు


తునిలో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం


కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్

కిర్లంపూడి: ప్రతిఒక్కరికీ సైబర్ నేరాలపై అవగాహన అవసరమని స్థానిక ఎస్సై జి.సతీష్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రగతి పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఎస్ఎల్వీ పాఠశాల విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహణ, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం పెరిగే కొద్దీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. మొబైల్స్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేస్తే అకౌంట్లలో నగదు మాయమయ్యే ప్రమాదం ఉందన్నారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ ఎన్వీ వెంకటరమణ, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ విధులపై అవగాహన

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు శనివారం జగ్గంపేట పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, రికార్డులు, వైర్‌లెస్ సెట్ వినియోగం, పిస్టల్ పనితీరు, లాకప్ తదితర అంశాలను ఎస్సై రఘునాథరావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

తుని: పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని స్థానిక జీఆర్పీ ఎస్సై జి. శ్రీనివాసరావు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సీతారామపురంలోని చెక్కాసూర్యనారాయణ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

తలుపులమ్మను దర్శించుకున్న దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఇంజినీర్


రైల్వే చీఫ్ ఇంజినీర్ కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

తుని రూరల్: కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారిని దక్షిణ మధ్య రైల్వే (ట్రాక్) చీఫ్ ఇంజినీర్ డి.ఆంజనేయులు రెడ్డి శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి దేవస్థానానికి వచ్చిన ఆయనకు వేదపండితులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం, పూజల అనంతరం పండితులు వారికి వేదాశీర్వచనాలు అందజేశారు. అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటాలను ఆలయ అధికారులు అందజేశారు.

28 వరకూ ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

కోటనందూరు: చైతన్యగోదావరి బ్యాంకు ఖాతాదారులకు ఈ నెల 28 వరకూ ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండవని ఆ బ్యాంకు స్థానిక బ్రాంచి మేనేజర్ పీవీ భాస్కర్ శనివారం తెలిపారు. ఆన్‌లైన్ యాప్‌లను అప్‌గ్రేడ్ చేస్తున్నందున అంతరాయం ఏర్పడిందన్నారు. మొబైల్, ఇంటర్నెట్, వాట్సాప్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్, ఏఈపీఎస్, బీబీపీఎస్, ఏటీఎంలు, ఏటీఎం కార్డులు, ఎస్ఎంఎస్ బ్యాలెన్స్ విచారణ తదితర సేవలు ఈ నెల 28 వరకూ తాత్కాలికంగా అందుబాటులో ఉండవని వివరించారు. ఖాతాదారులు బ్యాంకు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సొసైటీ మాజీ అధ్యక్షుడు గంటా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాకినాడ అంజు కంటి ఆసుపత్రి డాక్టర్ రోహిణి సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు, గొంతిన సురేష్, పంది బూరయ్య, గీసాల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.